తేది : 06 డిసెంబర్, 2020

# రైతులు, వరద బాధితులను ఆదుకోండి
# తక్షణమే ధాన్యం బకాయిలు ఇవ్వాలి
# సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రైతులను, నివార్ తుపాన్‌తో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి. పి.మధు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది రెండో పంటగా నెల్లూరు జిల్లాలో మూడు లక్షల ఎకరాలు సాగుచేశారని తెలిపారు. సుమారు 9లక్షల పుట్లు ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. రైతు సంఘాలు, రైతుల పోరాటం ఫలితం ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.15,500 ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం సకాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయని కారణంగా దళారులు, మిల్లర్లు, రంగ ప్రవేశం చేసి రైతులను నిలువునా దోపిడీ చేశారన్నారు. పుట్టికి సుమారు ఐదువేల రూపాయలు తగ్గించి ప్రయివేటు వ్యక్తులు కొనుగోలు చేశారన్నారు. ఫలితంగా జిల్లా వ్యాపితంగా సుమారు రూ.500 కోట్లు రైతుల శ్రమను దళారులు, మిల్లర్లు కొల్లగొట్టారన్నారు. ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ద్వారా సుమారు మూడు లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు రూ.550 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కేవలం రూ.350 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి కేవలం 48 గంటల్లోనే రైతుల అకౌంట్‌లో నగదు పడుతుందని చెప్పినా రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం రైతులకు నగుదు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే జిల్లాలో రైతులకు చెల్లించాల్సిన రూ. 175 కోట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. 20 రోజుల నుంచి నెల్లూరు జిల్లాలో భారీవర్షాలు, వరదలు అటు ప్రజలను, ఇటు రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచాయన్నారు. నివార్ తుపాన్, ఇప్పుడు బురేవి తుపాన్ ప్రభావంతో సుమారు లక్ష ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారన్నారు. పెన్నా పరివాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరదల్లో ప్రజలు నష్టపోయారని, వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే రైతులకు గిట్టుబాటు ధర లభించలేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని ఇప్పుడు నారుమళ్లతో దెబ్బతినడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సాయం అందించి ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, తిరుపతిలో అధికారులతో సమీక్ష చేసి వెళ్లారని ప్రజల్ని, రైతులను కలిసి ఉంటే తక్షణ సాయం ప్రాధాన్యత అర్థమయ్యేదన్నారు. ఈనెల 15 వరకు సర్వే నిర్వహించి, 31న సాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం తక్షణం సాయం చేయడం ముఖ్యమన్నారు. ఇది ఆలస్యం చేయడం భావ్యం కాదన్నారు. చేనేత కార్మికులు పరిస్థితి దయనీయంగానే ఉందన్నారు. సుమారు 4000 చేనేత కుటుంబాలు పనుల్లేక మగ్గాల గుంటల్లోకి నీరు చేరి, ఇబ్బందులు పడుతున్నారన్నారు. కష్టాల్లోని వారికి వెంటనే ఆదుకోవాలని, ఎప్పుడో 30 రోజుల తర్వాత సాయం చేస్తామనడం సరైంది కాదన్నారు.

= = = =